సాక్షి
ప్రకాశం
మంగళవారం । 28 । మార్చి । 2023



ప్రజా సమస్యలు పరిష్కరించాలి

ప్రజా సమస్యలు చిత్తశుద్ధితో పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి శ్రీలత అన్నారు. కలెక్టరేట్ స్పందనలో అర్జీలు స్వీకరించారు.

- 8లో..



జిల్లాకు కొత్త 104 వాహనాలు

ఫ్యామిలీ ఫిజీషియన్ ద్వారా మెరుగైన వైద్యసేవలందించేందుకు జిల్లాకు మరో 10 కొత్త 104 వాహనాలు కేటాయించారు.

- 8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34 /26

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వాతావరణంలో తేమ శాతం అధికం. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : సా॥ 06:27 ని॥
మంగళవారం

సహర్ : ఉ॥ 04:46 ని॥
బుధవారం

ఇంటింటికీ కృష్ణమ్మ



గొట్టిపడియ దగ్గర జరుగుతున్న ఇన్‌టెక్ వెల్ నిర్మాణ పనులు

భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని పశ్చిమ ప్రాంత ప్రజలకు స్వచ్ఛజలాలు అందించేందుకు చేపట్టిన మంచినీటి పథకం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో శాశ్వతంగా తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు రూ.1290 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. గొట్టిపడియ వద్ద ఇన్‌టెక్ వాల్ నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. ఇది పూర్తయితే ఫ్లోరైడ్ సమస్యకు చెక్ పెట్టడంతోపాటు కృష్ణమ్మ పరుగులు తీయనుంది.

- ఉమ్మడి ప్రకాశంలోని ఏడు నియోజకవర్గాల్లో తీరనున్న నీటి సమస్య
- ఉత్తుత్తి ప్రకటనలతో ప్రజలను మభ్యపెట్టిన టీడీపీ ప్రభుత్వం
- రూ.1290 కోట్లు కేటాయించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- జోరుగా ఇన్‌టెక్‌వాల్ నిర్మాణ పనులు
- 15 లక్షల మంది ప్రజలకు తాగునీరు సరఫరా

మార్కాపురం: అదిగో కృష్ణాజలాలు తీసుకు వస్తున్నామంటూ తెలుగుదేశం ప్రభుత్వం ఐదేళ్ల పాటు ఉత్తుత్తి ప్రకటనలతో ప్రజలను మభ్యపెట్టింది. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ శంకుస్థాపనల పేరుతో డూప్ షో నిర్వహించింది. కృష్ణమ్మ జలాలు వస్తాయనుకుని సంబరపడిన పశ్చిమ ప్రాంత ప్రజలకు నిరాశే మిగిలింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎమ్మెల్యే కేపీ నాగార్జున రెడ్డి నీటి సమస్యను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ పథకం గురించి సీఎంకు వివరించారు. వెంటనే స్పందించి రూ.1290 కోట్లు కేటాయించారు. దీంతో ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో శాశ్వత నీటి పరిష్కారానికి సంబంధించి అద్భుతమైన పథకం రూపుదిద్దుకుంది. పశ్చిమ ప్రకాశంలోని మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు, దర్శి, కనిగిరి, కొండపి తోపాటు శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పరిధిలోని కందుకూరు నియోజకవర్గల్లోని పలు గ్రామాల్లో ఇంటింటికీ కృష్ణ జలాలు అందనున్నాయి. ఈ పనులకు ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి శంకుస్థాపన చేశారు. గొట్టిపడియ వద్ద ఇన్‌టెక్ వెల్ నిర్మాణం పనులు జోరుగా సాగుతున్నాయి.తెలుగుదేశం నేతలు అధికారంలో ఉన్నంత కాలం ప్రధానంగా ఉన్న నీటి సమస్యను గాలికి వదిలేసి నేడు ఆందోళనలు చేయడం విడ్డూరంగా ఉందని ప్రజలు విమర్శిస్తున్నారు.

నిర్మాణం ఇలా..

గొట్టిపడియ డ్యాం నుంచి 1.95 టీఎంసీల నీటిని 7 నియోజకవర్గాల ప్రజలకు అందించనున్నారు. రూ.73 కోట్లతో ఇన్‌టెక్ వెల్ కమ్ పంప్ హౌస్ నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. 71 మీటర్ల ఎత్తులో ట్యాంక్ నిర్మాణం కావాల్సి ఉండగా ఇప్పటికే 46 మీటర్ల ఎత్తు పనులు పూర్తయ్యాయి. ఇంక 24 మీటర్లు మాత్రమే పనులు చేపట్టాల్సి ఉంది.

2051ని దృష్టిలో పెట్టుకొని..

2051 నాటికి ఉండే జనాభాను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టును డిజైన్ చేసింది. ప్రతి మనిషికి సగటున 55 లీటర్ల నీటిని అందించనుంది. వెలిగొండ ప్రాజెక్టు నుంచి నల్లమల సాగర్ ద్వారా గొట్టిపడియ డ్యాంకు నీళ్లు చేరతాయి. అక్కడి నుంచి ఇన్‌టెక్ వెల్ ద్వారా అన్ని గ్రామాలకు నీటిని అందిస్తారు. తొలి విడతలో మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు, కనిగిరి నియోజకవర్గాల్లోని 1192 గ్రామాల్లో వెలిగొండ నీటిని అందించడం ద్వారా తాగునీటి సమస్యతో పాటు ఫ్లోరైడ్ సమస్య కూడా తీరనుంది. రూ.1290 కోట్లకు ఆర్థిక శాఖ గత ఏడాది ఆమోదం తెలిపింది. జ్యూడిషియల్ ప్రివ్యూ కమిటీ కూడా ఆమోదం తెలిపింది. పనులను కలెక్టర్ దినేష్‌కుమార్‌తో పాటు ఎమ్మెల్యే కేపీ నాగార్జున రెడ్డి ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. గొట్టిపడియ నుంచి మార్కాపురం బైపాస్, మెడికల్ కాలేజ్ మీదుగా కనిగిరికి పైప్‌లైన్లు వేస్తారు. మరోలైన్‌లో కొనకనమిట్ల, హెచ్‌ఎంపాడు ప్రాంతాలకు, రెండో లైన్‌లో తర్లుపాడు ప్రాంతం వారికి నీటిని అందిస్తారు. మొత్తం 2800 కిలో మీటర్ల పొడవున పైప్‌లైన్లు నిర్మించాల్సి ఉంది. ఇందుకు సంబంధించిన సర్వే కూడా పూర్తి కావచ్చింది.

ఇంటింటికీ కృష్ణా నీళ్లు అందిస్తాం



ఈ పథకాన్ని మంజూరు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు. మొత్తం 7 నియోజకవర్గాల్లో శాశ్వతంగా నీటి సమస్య తీరుతుంది. ఫ్లోరైడ్ భారీ నుంచి ప్రజలు బయట పడతారు. అందరూ ఆరోగ్యంగా ఉంటారు. ఇన్‌టెక్ వెల్ పనులు పూర్తికావచ్చాయి. ప్రధానంగా పశ్చిమ ప్రకాశంలో నీటి సమస్య తీరనుంది. మొదటి దశలో మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు, కనిగిరి ప్రాంత ప్రజలకు మంచి నీళ్లు అందుతాయి. ప్రజల కల నిజం కాబోతుంది.

– కుందురు నాగార్జునరెడ్డి, ఎమ్మెల్యే



చర్చి సెంటర్‌లో మానవహారం నిర్వహిస్తున్న స్వయం సహాయక సంఘాల సభ్యులు

థ్యాంక్యూ సీఎం సార్

- సీఎంకు కృతజ్ఞతగా స్వయం సహాయక సంఘాల సభ్యుల బైక్ ర్యాలీ

ఒంగోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడో విడత ఆసరా నిధుల విడుదల చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ నగరంలోని స్వయం సహాయక సంఘాల సభ్యులు సోమవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక మెప్మా కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు, అక్కడ నుంచి నగర పాలక సంస్థ కార్యాలయం వరకు ఈ ర్యాలీ సాగింది. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కటారి శంకర్, గంటా రామానాయుడు, మెప్మా మేనేజర్ డీసీహెచ్ కొండయ్య, సీవోలు రవీంద్ర, సుబ్బారావు, రూపలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మెప్మా ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ చేస్తున్న స్వయం సహాయక సంఘాల సభ్యులు

30న రాష్ట్ర స్థాయి ఎడ్ల బండ పందేలు

మార్కాపురం: మార్కాపురం మండలం బొడుచర్ల గ్రామంలో శ్రీరామనవమి ఉత్సవాలను పురస్కరించుకొని ఈ నెల 30న రాష్ట్ర స్థాయి ఎడ్ల బండ పందేలు నిర్వహిస్తున్నట్లు వీరాంజనేయస్వామి సేవా సంఘ ప్రతినిధులు బొప్పరాజు శ్రీనివాసులు, టీవీ రమణ రెడ్డి, ఆడిటర్ జీవీ నారాయణరెడ్డి, తెలిపారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ బహుమతులుగా రూ.40, రూ.30, రూ.20, రూ.10 వేలను అందిస్తామన్నారు. ఆసక్తిగలవారు ఈ నెల 30 ఉదయం 7.30లోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని వివరాలకు 98491 79311, 9441997530 నంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

న్యూస్‌రీల్

రేపు ఏకేయూ పరిధిలో పరిచయ కార్యక్రమం

ఒంగోలు: ఆంధ్రకేసరి యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ, పీజీ కాలేజీల చైర్మన్‌లు, సెక్రెటరీలతో ఈనెల 29న పరిచయ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏకేయూ డీన్ డాక్టర్ వెంకటేశ్వర రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ మారెడ్డి అంజిరెడ్డి, రిజిస్ట్రార్ బి.హరిబాబు హాజరవుతారన్నారు. పూర్వ ప్రకాశం జిల్లాలోని అన్ని డిగ్రీ, పీజీ కాలేజీల యాజమాన్యాలు ఉదయం 10.30 గంటలకు ఒంగోలులోని ఏకేయూ ఆవరణలో జరిగే కార్యక్రమానికి హాజరుకావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

వైఎస్సార్ సీపీ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షునిగా శంకరరెడ్డి



పిడతల శంకరరెడ్డితో మాట్లాడుతున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

ఒంగోలు: వైఎస్సార్ సీపీ గ్రీవెన్స్ సెల్ ప్రకాశం జిల్లా ఇన్‌చార్జిగా పిడతల శంకరరెడ్డి నియమితులయ్యారు. సోమవారం చెవిరెడ్డి భాస్కర రెడ్డి చేతులమీదుగా పిడతల శంకరరెడ్డి అపాయింట్‌మెంట్ ఉత్తర్వులు అందుకున్నారు. ఈ సందర్భంగా చెవిరెడ్డి మాట్లాడుతూ ఏప్రిల్ 10వ తేదీలోగా జిల్లాస్థాయిలో, మండల స్థాయిలో, గ్రామస్థాయిలో గ్రీవెన్స్ కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా స్థాయిలో శాసనసభ్యులతో కోఆర్డినేట్ చేసుకుని నవరత్నాలు, ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించి పార్టీకి మంచి పేరు తేవాలన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ సహాయ కో ఆర్డినేటర్‌గా హర్షప్రీతమ్‌దేవ్



నియామక పత్రాన్ని అందుకుంటున్న డాక్టర్ హర్షప్రీతమ్‌దేవ్ కుమార్

ఒంగోలు: ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం ఎన్‌ఎస్‌ఎస్ అసిస్టెంట్ కోఆర్డినేటర్‌గా డాక్టర్ మండే హర్షప్రీతమ్‌దేవ్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు రిజిస్ట్రార్ హరిబాబు ఉత్తర్వులు జారీచేశారు. ఉత్తర్వుల ప్రతిని యూనివర్సిటీ వైస్ చాన్సలర్ మారెడ్డి అంజిరెడ్డి, డాక్టర్ హరిబాబుల చేతులమీదుగా అందుకున్నారు. హర్షప్రీతమ్‌దేవ్ కుమార్ నాలుగు సంవత్సరాలుగా జిల్లా ఎన్‌ఎస్‌ఎస్ నోడల్ అధికారిగా పనిచేస్తున్నారు.

బీసీ విభాగానికి ప్రత్యేక ఛాంబర్

ఒంగోలు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బీసీ విభాగానికి ప్రత్యేక ఛాంబర్ సోమవారం ఏర్పాటైంది. శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోలి తిరుపతిరావు, మాజీ అధ్యక్షుడు కటారి శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక ఛాంబర్ ద్వారా ఎప్పటికప్పుడు బీసీల సమస్యలను తెలుసుకుంటూ వారిని పార్టీకి దగ్గర చేసేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. బీసీలకు సంబంధించిన అంశాలపై ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లేందుకు ప్రత్యేక ఛాంబర్ తోడ్పడుతుందని, ఇందుకు అవకాశం కల్పించిన పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి, జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోలి తిరుపతిరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేదర కార్పొరేషన్ చైర్మన్ కేతా లలిత నాంచారమ్మ, చాత్తాద శ్రీవైష్ణవ కార్పొరేషన్ చైర్మన్ టి.మనోజ్‌కుమార్, టైలర్స్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ షేక్ మస్తాన్‌బీ, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ గోనుగుంట రజని, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ధరణికోట లక్ష్మీనారాయణ, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, సాంస్కృతిక విభాగం జోనల్ ఇన్‌చార్జి బొట్ల సుబ్బారావు, రజక సంఘం జిల్లా అధ్యక్షుడు మార్లెళ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జున, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, కలెక్టర్ దినేష్‌కుమార్, ఎమ్మెల్యేలు



హెలిప్యాడ్ వద్ద సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని కలసిన కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు, వరికూటి అమృతపాణి తదితరులు



వరికూటి కోటమ్మకు నివాళులర్పించేందుకు వచ్చిన ప్రజలు

అధినేతకు స్వాగతం..

టంగుటూరు: జిల్లాకు వచ్చిన ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మంత్రులు, ఎంపీ, పార్టీ నాయకులు, అధికారులు స్వాగతం పలికారు. కొండపి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి వరికూటి అమృతపాణి, వరికూటి వెంకట రమణారావుల మాతృమూర్తి కోటమ్మ భౌతికకాయానికి నివాళులర్పించేందుకు సీఎం జగన్‌మోహన్ రెడ్డి సోమవారం వచ్చారు. ఉదయం తాడేపల్లి నివాసం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి టంగుటూరు మండలం కారుమంచి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌లో సీఎం జగన్ మోహన్‌రెడ్డి 11:15 నిమిషాలకు దిగారు. ఆయనతోపాటు పార్టీ రీజినల్ కోఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసులరెడ్డి కూడా ఉన్నారు. కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ మల్లికా గర్గ్, ఎంపీ, మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు, నాయకులు స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గాన అంబేడ్కర్ క్రీడాప్రాంగణంలో కోటమ్మ భౌతికకాయానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. తిరిగి హెలిప్యాడ్ వద్దకు చేరుకొని పార్టీ నాయకులతో మాట్లాడారు. తనను కలిసేందుకు వచ్చిన దివ్యాంగుడిని ఆప్యాయంగా పలుకరించారు. మధ్యాహ్నం 12:23 ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, బాలినేని శ్రీనివాసులరెడ్డి హెలికాప్టర్లో తాడేపల్లికి బయలుదేరారు. తక్కువ సమయంలో సీఎం పర్యటన విజయవంతం చేసినందుకు కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ మలికా గర్గ్‌కు, అని శాఖల అధికారులకు వరికూటి అశోక్‌బాబు ధన్యవాదాలు తెలిపారు. మంత్రులు ఆదిమూలపు సురేష్, మేరుగ నాగార్జునరెడ్డి, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, రాష్ట్ర ఆరోగ్య శ్రీ ప్రత్యేక అధికారి డాక్టర్ యాదాల అశోక్, టీటీడీ బోర్డు మెంబర్, కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్, చీరాల, మార్కాపురం, ఎస్‌ఎన్‌పాడు, గిద్దలూరు, దర్శి ఎమ్మెల్యేలు కరణం బలరాం, కుందురు నాగార్జునరెడ్డి, టీజేఆర్ సుధాకర్‌బాబు, అన్నా రాంబాబు, మద్దిశెట్టి వేణుగోపాల్, పార్టీ ఇన్‌చార్జులు కరణం వెంకటేష్, బాచిన కృష్ణ చైతన్య, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ పోతుల సునీత, ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, సీఎం సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఏర్పాట్లు

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాక సందర్భంగా పోలీసులు, అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. వరికూటి కుటుంబ సభ్యులు ఇచ్చిన పేర్ల జాబితాతో పాటు ప్రధానమైన వ్యక్తులను 50 మందిలోపు మినహా ఎవర్నీ భౌతికకాయం ఉంచిన డయాస్ వద్దకు పోలీసులు అనుమతించలేదు. ఎస్పీ మలికా గర్గ్ ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు తగిన సూచనలు చేశారు.





ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని కలసిన జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి



మంత్రి ఆదిమూలపు సురేష్‌తో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



ఎస్పీ, కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న వరికూటి అశోక్‌బాబు





సీఎం వైఎస్ జగన్‌తో మాట్లాడుతున్న కనిగిరి, గిద్దలూరు ఎమ్మెల్యేలు బుర్రా మధుసూదన్ యాదవ్, అన్నా వెంకట రాంబాబు









సీఎం వైఎస్ జగన్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు మద్దిశెట్టి వేణుగోపాల్, కేపీ నాగార్జునరెడ్డి, టీజేఆర్ సుధాకర్‌బాబు, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత

తక్షణ సాయం అందించాలి



బాధితులతో మాట్లాడుతున్న సీఎం జగన్

టంగుటూరు: కారుమంచిలో వరికూటి కోటమ్మకు నివాళులర్పించిన అనంతరం సీఎం జగన్ మోహన్‌రెడ్డికి పలువురు వినతిపత్రాలు అందించారు. జయవరం గ్రామానికి చెందిన మేదరమెట్ల భరత్‌రెడ్డి మామయ్య కొండూరి సుబ్బారెడ్డి 2020 ఫిబ్రవరిలో కందుకూరు మండలం పలుకూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఆస్పత్రికి తీసుకెళ్లగా రూ.10 లక్షలు ఖర్చయినా కాలు తీసేశారు. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న తనను ఆదుకోవాలని సుబ్బారెడ్డి రూ.8.25 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ కోసం ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. దీనిపై సీఎం జగన్‌కు వినతిపత్రం అందించగా సమస్య పరిష్కరించాలని ఆయన కలెక్టర్ దినేష్ కుమార్‌ను ఆదేశించారు. ఆ తరువాత మీకు సాయం త్వరలోనే అందుతుందని సీఎం కార్యాలయం నుంచి సుబ్బారెడ్డికి ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు.

క్లుప్తంగా

హత్య కేసులో భర్తకు యావజ్జీవ శిక్ష

మార్కాపురం: అనుమానంతో భార్యను మంచం కోడుతో తలపై కొట్టి హత్య చేసిన కేసులో నేరం రుజువు కావడంతో భర్తకు యావజ్జీవ జైలుశిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తూ మార్కాపురం జిల్లా ఆరో అదనపు న్యాయమూర్తి రాజా వెంకటాద్రి సోమవారం తీర్పు చెప్పినట్లు పబ్లిక్ ప్రాసిక్యూటర్ డి. గాంధీరెడ్డి తెలిపారు. త్రిపురాంతకం మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన ఆరటోలు కాశయ్య తన భార్య బాలమ్మపై అనుమానంతో తరుచూ ఇంట్లో గొడవలు పెట్టుకునేవాడు. ఇదే క్రమంలో 2016 ఫిబ్రవరి 22న కాశయ్య భార్యను మంచం కోడుతో కొట్టడంతో మృతి చెందింది. త్రిపురాంతకం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి నిందితున్ని అరెస్టు చేశారు. కేసులో సాక్ష్యాలు రుజువు కావడంతో కాశయ్యకు యావజ్జీవ జైలుశిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. నిందితునికి శిక్ష పడేలా చేసిన పోలీస్ అధికారులను ఎస్పీ మలికాగర్గ్ అభినందించారు. లైజన్ ఆఫీసర్‌గా ఐవీ శ్రీను, కోర్టు కానిస్టేబుల్‌గా ఎస్‌కే ఇమామ్ సాహెబ్‌లు వ్యవహరించారు.

పోలీసు అధికారులకు ఎస్పీ రివార్డ్స్

ఒంగోలు టౌన్: వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్ బాబు మాతృమూర్తి కోటమ్మ భౌతికకాయానికి నివాళి అర్పించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సోమవారం టంగుటూరు మండలం కారుమంచికి రావడం తెలిసిందే. ఈ సందర్భంగా ఎలాంటి అవాంతరాలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేశారు. తక్కువ సమయంలో పోలీసులు సమర్ధవంతంగా బందోబస్తు నిర్వహించడమే కాకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టి పర్యటన విజయవంతంగా జరగడానికి దోహదపడ్డారని ఎస్పీ మలికాగర్గ్ ప్రశంసించారు. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం కావడంలో కీలకపాత్ర పోషించిన పోలీసు అధికారులు, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించిన ఎస్పీ రివార్డ్స్ ప్రకటించారు. కారుమంచి హెలీప్యాడ్ వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ఎస్పీ మలికాగర్గ్ మర్యాదపూర్వకంగా కలిశారు.

మళ్లీ సీఎంగా జగనన్నను ఆశీర్వదించండి


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు


లబ్ధిదారులకు కరపత్రాలు అందజేస్తున్న దృశ్యం

- జగనన్న ఆధ్వర్యంలో సంక్షేమ పథకాల వెల్లువ
- సైడు కాలువల అభివృద్ధికి శంకుస్థాపన
- గడప గడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

చీమకుర్తి: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు ఆశీర్వదించండి అంటూ జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు పిలుపునిచ్చారు. బూదవాడ పంచాయతీ మర్రిచెట్లపాలెంలో ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వంలో జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక గ్రామంలోని లబ్ధిదారులనుద్దేశించి వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోఉన్న గత నాలుగేళ్లలో సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి అందించారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న సంక్షేమ పథకాలను తిరిగి నిరంతరం పొందాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత మనందరిపై ఉందని లబ్ధిదారులకు తెలిపారు. ప్రతి ఇంటికి తిరిగి సంక్షేమ పథకాలను పొందిన లబ్ధిదారులు ఎంత మంది ఉన్నారని అడిగి తెలుసుకున్నారు. ప్రతి గడపలో ప్రభుత్వం ద్వారా ఎంత మొత్తంలో ప్రయోజనం పొందారో సచివాలయం సిబ్బంది ద్వారా సేకరించిన గణాంకాలతో లబ్ధిదారులకు వివరించారు. రానున్న ఎన్నికల్లో సంక్షేమ పథకాలను పొందిన లబ్ధిదారులంతా వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. తొలుత గ్రామంలోకి ప్రవేశించే ముందు జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబుకు భారీగా స్వాగతం పలికారు. డప్పు వాయిద్యాలతో బాణసంచా కాలుస్తూ ఆప్యాయంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు వేమా శ్రీనివాసరావు, రూరల్ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, స్థానిక సర్పంచ్ జనరాజుపల్లి మరియమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు చిన్నపురెడ్డి సుశీల, చిన్నపురెడ్డి పాపిరెడ్డి, సంజీవరెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

జిల్లాకు కొత్త 104 వైద్య వాహనాలు


జెండా ఊపి 104 వాహనాలను ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

- జెండా ఊపి ప్రారంభించిన కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ద్వారా ఇంటి వద్దకే వైద్య సేవ మరింత మెరుగ్గా అందించేందుకు జిల్లాకు అదనంగా మరో 10 కొత్త 104 వైద్య వాహనాలు కేటాయించారు. సోమవారం జిల్లాకు వచ్చిన వాహనాలను ప్రకాశంభవనంలో కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ప్రస్తుతం జిల్లాలో 38 వాహనాలు ఉండగా ఇప్పుడు అదనంగా మరో పది వాహనాలు మంజూరయ్యాయని కలెక్టర్ తెలిపారు. వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ఎక్కువగా ఉన్న త్రిపురాంతకం, మార్కాపురం, కనిగిరి, దర్శి, మద్దిపాడు, టంగుటూరు, చీమకుర్తి, కొనకనమిట్ల, నాగులుప్పలపాడు మండలాలకు ఈ వాహనాలకు కేటాయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి, ఫ్యామిలీ ఫిజిషియన్ నోడల్ అధికారి డాక్టర్ మాధవీలత, 108 జిల్లా మేనేజర్ విజయ్‌కుమార్, 104 జిల్లా మేనేజర్ జిలానీ, కోటేశ్వరరావు, శ్రీకాంత్, డాక్టర్ సుందర్ తదితరులు పాల్గొన్నారు.

కుంటలో పడి యువకుడు మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై షేక్ ఫిరోజ్‌ఫాతిమా

సింగరాయకొండ: పశువుల కుంటలో పడి గుర్తు తెలియని యువకుడు(30) మృతి చెందాడు. ఈ సంఘటన సోమవారం పాతసింగరాయకొండ పంచాయతీ అయ్యప్పనగర్ సమీపంలోని పశువుల కుంటలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పశువుల కుంటలో యువకుని శవం తేలియాడుతుందని పశువుల కాపరులు చెప్పిన సమాచారంతో మృతదేహాన్ని యువ నేస్తం ఫౌండేషన్ యువకుల సహకారంతో ఒడ్డుకు చేర్చారు. మృతదేహాన్ని పరిశీలించగా 3 రోజుల క్రితం చనిపోయి ఉండవచ్చని తెలుస్తోంది. అతని వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి గుర్తు పట్టలేని విధంగా ఉంది. మృతదేహం కుడి చేతిపైన అమ్మ, త్రిశూలం డమరుకం, సన్నీ అని పచ్చ రంగు ఉన్న మచ్చలు ఉన్నాయని పోలీసులు పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఫిరోజ్ ఫాతిమా తెలిపారు.

ప్రజా సమస్యలు చిత్తశుద్ధితో పరిష్కరించాలి

- జిల్లా రెవెన్యూ అధికారి శ్రీలత


స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్‌ఓ శ్రీలత

ఒంగోలు అర్బన్: ప్రజల సమస్యలను చిత్తశుద్ధి పరిష్కరించాలని, స్పందనలో ప్రజలు ఇచ్చిన అర్జీల తాలూకా సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్‌ఓ) ఆర్ శ్రీలత అధికారులకు సూచించారు. సోమవారం స్పందన భవనంలో స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. తొలుత డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం ద్వారా దూర ప్రాంత ప్రజల సమస్యలను ఫోన్ ద్వారా తెలుసుకుని సంబంధిత అధికారులకు పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ మాట్లాడుతూ స్పందన సమస్యలు పరిష్కరిస్తే తిరిగి పునారావృతం కాకుడదన్నారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులు, ఉద్యోగులు సమస్యల పరిష్కారంపై చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ప్రతి రోజు కనీసం ఒక గంట సమయం ప్రజా సమస్యల పరిష్కారానికి కేటాయించి చక్కగా పనిచేయాలన్నారు. దీనిలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు లోకేశ్వరరావు, ఉమాదేవి, కె.మాధురి ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

- చీమకుర్తి మండలం చీమలమర్రి గ్రామానికి చెందిన విజయ్‌ప్రసాద్ డయల్ యువర్‌కలెక్టర్‌కు ఫోన్‌చేసి తన జామాయిల్ తోట అగ్నిప్రమాదానికి గురైందని తనకు నష్ట పరిహారం ఇప్పించాలని కోరారు. స్పందించిన డీఆర్‌ఓ విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని ఆదేశించారు.
- హనుమతునిపాడు మండలం నందనవనం గ్రామానికి చెందిన వెంకటనారాయణ స్పందనలో అధికారులను కలిసి తనకు వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ అర్జీ అందచేశారు.
- కొమరోలు మండలం రెడ్డిచెర్ల గ్రామానికి చెరందిన బి.దానం సర్వే నెంబర్ 1184, 1185లో తన భార్య పేరుపై అసైన్‌మెంట్ భూమి ఉందని అయితే కొంతమంది వ్యక్తులు ఆ భూమిని లాక్కోవాలని దౌర్జన్యం చేస్తున్నారంటూ ఫిర్యాదు చేశాడు. పరిశీలించి తనకు న్యాయం చేయాలని కోరారు.
- త్రిపురాంతకం మండలం రామసముద్రం గ్రామానికి చెందిన నరసారెడ్డి డయల్ యువర్ కలెక్టర్‌కు ఫోన్ చేసి సర్వే నంబర్ 306, 226 ఎఫ్‌ఎల్‌ఆర్, అడంగళ్ (1బి) వివరాల కోసం ఆర్‌టీఐ ద్వారా దరఖాస్తు చేశామని అయినా సమాచారం ఇవ్వడం లేదని ఫిర్యాదు చేశారు. పరిశీలించి పరిష్కరించాలని డీఆర్‌ఓ సంబంధిత తహసీల్దార్‌ను ఆదేశించారు.

నేషనల్ గ్రీన్ క్లబ్ కార్యక్రమాలపై సమీక్ష


ఏపీ ఎన్‌జీసీ డైరెక్టర్ స్రవంతితో మాట్లాడుతున్న డీఈఓ రమేష్

ఒంగోలు: నేషనల్ గ్రీన్ క్లబ్ కార్యక్రమాలపై ఏపీ నేషనల్ గ్రీన్ క్లబ్ డైరెక్టర్ పి.స్రవంతి సోమవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో విద్యాశాఖ అధికారులతో సమీక్షించారు. జిల్లాలో జరుగుతున్న కార్యక్రమాలపై చర్చించారు. ఏపీ ఎన్‌జీసీ కార్యక్రమాలైన ఎకో క్లబ్‌లు, గ్రీన్ స్కూల్స్, మొక్కలు పెంపకం, పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ ఫ్రీ, ఇంధన పొదుపు, కిచెన్ గార్డెన్స్ వ్యర్థాల నిర్వహణ, నీటి సంరక్షణ వంటి కార్యక్రమాల అమలుకు జిల్లాలోని 358 పాఠశాలల్లో నిర్వహించేందుకు కాన్సెప్ట్‌ను విస్తృతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఈఓ పి.రమేష్‌తో పాటు ఏపీ ఎన్‌జీసీ జిల్లా కో ఆర్డినేటర్ ఎం.సజీవరాజు, క్లస్టర్ కో ఆర్డినేటర్ ఒద్దుల రవిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు అండగా ఉంటాం


ఆర్‌ఆర్ కాలనీలో భూమి పూజలో సబ్‌కలెక్టర్ శోభిక, పక్కన ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి

గుడ్లూరు: రామాయపట్నం పోర్టు నిర్మాణానికి భూములు ఇచ్చిన మూడు గ్రామాల ప్రజలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని, నిర్వాసితులకు అందాల్సిన పునరావాస ప్యాకేజీ, నష్టపరిహారం పూర్తి స్థాయిలో అందిస్తున్నామని ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి అన్నారు. తెట్టు–రామాయపట్నం గ్రామాల మధ్య ఆర్‌ఆర్ కాలనీలో పోర్టు నిర్వాసిత గ్రామమైన ఆవులవారిపాలెం గ్రామస్తులకు నిర్మిస్తున్న గృహ నిర్మాణాల భూమిపూజలో సోమవారం ఎమ్మెల్యేతో పాటు కందుకూరు సబ్ కలెక్టర్ శోభిక పాల్గొన్నారు. భూమిపూజలో పాల్గొన్న అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రామాయపట్నం పోర్టు నిర్మాణానికి భూములతో పాటు గృహాలు కోల్పోయిన మొండివారిపాలెం, ఆవులవారిపాలెం, కర్లపాలెం గ్రామస్తులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద పునరావాసంతో పాటు నష్టపరిహారాన్ని ప్రభుత్వం అందిస్తుందన్నారు. మొండివారిపాలెం గ్రామస్తులు నిర్మించుకుంటున్న గృహాలు నిర్మాణాలు జరుగుతున్నాయని, ఆవులవారిపాలెం గ్రామస్తులు కూడా నిర్మాణ పనులు ప్రారంభించాలన్నారు. పోర్టు ఏర్పాటుతో ఈ ప్రాంతం పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందుతుందని తెలిపారు. పోర్టుకు భూములు, గృహాలు ఇచ్చిన మీ మేలును ఎప్పటికీ మరువలేమన్నారు. తెట్టు నుంచి పోర్టు వరకు రోడ్డును 80 అడుగులు విస్తరించేలా ప్రతిపాదనలు పంపామన్నారు. అలాగే జాతీయ రహదారి నుంచి కరేడు మీదగా తీరప్రాంత గ్రామాలు మీదగా సాగర మాల కింద పోర్టు వరకు రహదారి నిర్మాణానికి కూడా ప్రతిపాదనలు పంపినట్లు పేర్కొన్నారు. జీవనభృతి కోల్పోయిన మత్స్యకారులకు వేట ద్వారా జీవన భృతిని కల్పించడానికి చర్చలు జరుగుతున్నాయన్నారు. సబ్ కలెక్టరు శోభిక మాట్లాడుతూ ఆవులవారిపాలెం గ్రామానికి చెందిన 110 కుటుంబాలు వారికి అర్‌ఆర్ కాలనీలో గృహాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. వారికి ఒక్కొక్కరికి రూ.9.90 లక్షలు అందిస్తామన్నారు. మూడు రోజుల్లో వారికి నగదు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పోర్టు ఎండీ ప్రతాప్‌రెడ్డి, లైజనింగ్ ఆఫీసర్ ఐవీ రెడ్డి, తహసీల్దార్ సూర్యనారాయణ సింగ్, సర్పంచ్‌లు చాపల రమణయ్య, గంగమ్మ, మత్స్యకార నాయకులు సుధాకర్‌లు పాల్గొన్నారు.

వల్లూరమ్మ ఆలయ హుండీ ఆదాయం రూ.24.83 లక్షలు


ఆలయంలో హుండీలు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

టంగుటూరు: జిల్లాలో ప్రసిద్ధి చెందిన వల్లూరమ్మ తల్లి ఆలయంలో సోమవారం హుండీలు లెక్కించారు. మొత్తం 147 రోజులకు గాను 10 హుండీలు లెక్కించగా రూ. 24,83,283 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ బి.రమేష్ తెలిపారు. అలాగే బంగారం 142 గ్రాములు, వెండి 383 గ్రాములు వచ్చాయన్నారు. కార్యక్రమంలో దేవదాయ ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాలరావు, ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ కాలె శ్రీనివాసరావు, ఆలయ ప్రధాన అర్చకులు నాగేశ్వరరావు, ఉప ప్రధాన అర్చకులు ఉమా శంకర్, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలు సద్వినియోగం చేసుకోండి


మాట్లాడుతున్న స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి లోకనాథం

చీమకుర్తి: ప్రభుత్వం కల్పించే ఉపాధి అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ఆర్.లోకనాథం యువతకు పిలుపునిచ్చారు. జిల్లా యువజన సర్వీస్‌ల శాఖ ఆధ్వర్యంలో సోమవారం పేర్నమిట్ట జిల్లాపరిషత్ హైస్కూలులో వ్యక్తిత్వ వికాసం కమ్యూనికేషన్స్‌పై యువతకు ఉపాధి అకాశాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్‌మేళాలు, ఉచిత శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ప్రమోద, స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

గుండెపోటుతో బ్యాంకులోనే కన్నుమూత

హనుమంతునిపాడు: గుండెపోటుతో ఖాతాదారుడు బ్యాంకులోనే సీట్లోనే కన్నుమూశాడు. ఈ సంఘటన మండల పరిధిలోని వేములపాడు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో జరిగింది. వివరాల్లోకి వెళితే..మహమ్మదపురం గ్రామానికి చెందిన చేబ్రోలు వెంకటేశ్వర్లు(65) భార్య చేబ్రోలు తిరుపతమ్మ పేరు మీద క్రాపు లోను తీసుకున్నారు. లోను చెల్లించేందుకు సోమవారం భార్యభర్తలు బ్యాంకుకు వచ్చారు. భార్య కౌంటర్‌లో నగదు చెల్లిస్తుండగా..వెంకటేశ్వర్లు కుర్చీలో ఉండగా..ఒక్కసారిగా గుండెపోటుకు గురై పడిపోయాడు. బ్యాంకు సిబ్బంది పక్కనే ఉన్న ఆర్‌ఎంపీని పిలిపించి పరీక్షలు చేయగా మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుని స్వగ్రామం మహమ్మదాపురమైనా కొంత కాలంగా గుంటూరులో స్థిర నివాసం ఏర్పరుచుకున్నారు. స్వగ్రామంలో వ్యవసాయ భూములు ఉండగా.. వాటి పేరు మీద రుణాలు తీసుకొని చెల్లించడానికి వచ్చి కన్నుమూశాడు. విషయ, తెలుసుకున్న బంధువులు మృతదేహాన్ని గుంటూరు తీసుకెళ్లారు.

e-ప్రొక్యూర్‌మెంట్ స్వల్పకాలిక టెండర్ నోటీసు

కార్యనిర్వాహక ఇంజనీరు, ఏ.పి.ఇ.డబ్ల్యూ.ఐ.డి.సి. ఒంగోలు వారి కార్యాలయపు e-ప్రొక్యూర్‌మెంట్ స్వల్పకాలిక టెండరు నిట్ నెం.07/2022-23 నుండి **13/2022-23 తేది: 27-03-2023** ద్వారా 7 గ్రామములలో గల బ్రాంచ్ లైబ్రరీలకు ప్రహరీగోడలు మరియు మరుగుదొడ్ల నిర్మాణపు పనులకు అర్హత గల కాంట్రాక్టర్ల నుండి e-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా ఆన్‌లైన్ టెండర్లు ఆహ్వానించబడుచున్నవి. టెండరు షెడ్యూళ్ళను **తేది: 01-04-2023 రా.గం.11.30 నుండి తేది: 10.04.2023 మ.గం.02.30 వరకు** డౌన్లోడ్ చేసుకొనవచ్చును టెండర్ల స్వీకరణకు చివరి **తేది: 10-04-2023 సా.గం.04.00 వరకు** మరియు **బిడ్ల తేది: 10-04-2023 సా.గం.04.30 నుండి** తెరవబడును. ఇతర వివరముల కొరకు **సెల్: 9908661999**కు ఫోను చేసి తెలుసుకొనవచ్చును.

సం/- పి.భాస్కరబాబు, కార్యనిర్వాహక ఇంజనీరు, ఏ.పి.ఇ.డబ్ల్యూ.ఐ.డి.సి., ఒంగోలు.

న్యాయవాదులు దరఖాస్తు చేసుకోవాలి

ఒంగోలు: జాతీయ న్యాయసేవాధికార సంస్థ సూచనల మేరకు రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం జిల్లా న్యాయసేవాధికార సంస్థలో న్యాయ సేవ న్యాయవాదుల (చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్) నియమకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఏ భారతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 7వ తేదీ సాయంత్రం 5గంటల లోగా విద్యార్హత, కేసుల వివరాలతో కూడిన దరఖాస్తును జిల్లా న్యాయసేవాధికార సంస్థలో స్వయంగా లేదా స్పీడ్ పోస్టు ద్వారా అందించాలన్నారు.

హత్యాయత్నం కేసులో నాలుగేళ్ల జైలు

ఖలీల్‌వాడి : బాలుడిపై హత్యాయత్నం చేసిన కుడుములు లడ్డు అలియాస్ సుంకరి రవికి నాలుగేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ నిజామాబాద్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఎన్ శ్రీకాంత్ బాబు సోమవారం తీర్పు వెల్లడించారు. ప్రకాశం జిల్లా కనిగిరి మండలం పోలారం గ్రామానికి చెందిన శ్యామ్(13) తన చిన్నాన్న అయిన కుడుములు రాజు దగ్గరకు నందిపేట్ మండలం వన్నెల్(కె) గ్రామానికి వచ్చాడు. వారి బంధువైన కుడుములు లడ్డు అలియాస్ సుంకర రవి మాక్లూర్ మండలం ధర్మోరాలో స్థిరపడ్డాడు. రవి వన్నెల్(కె) గ్రామానికి వచ్చి నిజామాబాద్‌లో సినిమా చూసివద్దామని చెప్పి 2016 జూన్ 2న శ్యామ్‌ను బైక్‌పై తీసుకెళ్లాడు. శ్యామ్ తండ్రి జీవరత్నంతో తనకు ఉన్న పాత కక్షను మనసులో పెట్టుకొని అతనిని చంపాలనుకున్నాడు. నందిపేట వైన్‌షాపులో కొనుగోలు చేసిన బీర్లు తాగి, బీరు సీసాను పగులగొట్టి శ్యామ్‌ను పొడిచి మృతి చెందాడని భావించి వెళ్లిపోయాడు. గాయపడిన బాలుడిని చూసిన గ్రామస్తులు నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నిజామాబాద్ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కోర్టుకు సమర్పించిన అభియోగ పత్రం ఆధారంగా సాక్షుల వాంగ్మూలాలు నమోదు చేసిన కోర్టు ముద్దాయిపై హత్యాయత్నం కేసు రుజువైనట్లు నిర్ధారిస్తూ నాలుగేళ్ల కఠిన జైలుశిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధించారు.

తాబేళ్ల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

- ఫారెస్టు రేంజర్ శ్రీదేవి

వేటపాలెం: జిల్లా తీరం వెంట సముద్ర తాబేళ్ల సంరక్షణపై ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఫారెస్టు రేంజర్ ఆర్ శ్రీదేవి తెలిపారు. మండల పరిధిలోని అక్కాయిపాలెం పంచాయతీ లక్ష్మీపురంలోని ట్రీఫౌండేషన్‌లో తాబేళ్ల సంరక్షకులకు సోమవారం అవగాహన ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ 2017 నుంచి జిల్లాలో ఆలీవ్‌రిడ్లే తాబేళ్ల పిల్లలను సంరక్షిస్తున్నామని తెలిపారు. సముద్ర జీవవైవిధ్యంలో భాగంగా ఆలీవ్ రిడ్లే తాబేళ్ల సంరక్షణ ప్రధానమన్నారు. తాబేళ్ల మనుగడలో ఎవరైనా భంగం కలిగిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వీటిని సంరక్షించుకోవడం కోసం తీరప్రాంత గ్రామాల్లో సంరక్షకులను ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల సమన్వయకర్త శవనం చంద్రారెడ్డి, సంరక్షకులు రత్నకుమారి, దయామణి, మయూరి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఫారెస్టు రేంజర్ శ్రీదేవి